గాంధీ ప్రాంగణంలో అన్నదానం



గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో అయ్యప్ప ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో రోగి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణ, విష్ణుప్రియ దంపతుల సౌజన్యంతో సుమారు 500 మందికి అన్నదానం చేశారు. దశాబ్దకాలంగా అనేక సామాజిక, ఆధ్యాత్మిక సేవకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ధర్మశాస్త్ర సేవసమితి నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్ అలియాస్ బొంబాయి గురుస్వామి, పుల్లారావు, కేవీ రాజేంద్ర ప్రసాదరావు, సభ్యులు శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి, శివకిషోర్, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, మహేష్, హేమలత, సాయిభార్గవి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో సౌత్‌జోన్ చాంపియన్‌గా అవినీష్



మాస్టర్ అవినీష్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని సెయింట్ పీటర్స్ స్కూల్ విద్యార్థిని బొలిశెట్టి అవినీష్ సీబీఎస్‌ఈ సౌత్ జోన్ తైక్వాండో కాంపిటీషన్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్కాపురం కమలా హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన నికోబార్‌లకు చెందిన సీబీఎస్‌ఈ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అవినీష్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల అతని తల్లిదండ్రులు మమతాజైన్- బిందు కిరణ్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల 3 నుంచి 7వ తేదీ వరకు ఇటావాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు తెలిపారు.

గాంధీ ఆస్పత్రిలో రోగి అదృశ్యం



అతుల్‌చంద్ర మెహతో

గాంధీఆస్పత్రి : చికిత్స పొందుతున్న రోగి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. సంగారెడ్డిజిల్లా, బొంతపల్లి దోమడుగు గ్రామానికి చెందిన అతుల్‌చంద్ర మెహతో (46) కొంతకాలంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. స్థానిక వైద్యుల సూచన మేరకు వారం రోజుల క్రితం గాంధీఆస్పత్రిలో చేర్పించారు. భార్య అలియాదేవి సేవలందిస్తోంది. ఈనెల 24న అలియాదేవి బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి వార్డులోని బెడ్‌పై ఉండాల్సిన అతుల్‌చంద్ర మెహతో కనిపించలేదు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలతో పాటు స్వగ్రామంలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

జెక్‌కాలనీలో ఆత్మీయ సమావేశం



చల్లా మధుకర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

సనత్‌నగర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తూ ముందుకుసాగుతుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. జెక్‌కాలనీలోని చల్లాగ్రైడ్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త చల్లా మధుకర్‌రెడ్డితో పాటు పలువురు కాలనీవాసులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంతోమందికి చేయూతనందిస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్న చల్లా మధుకర్‌రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో రాజారెడ్డి, నాగులపల్లి వెంకట్‌రెడ్డి, రామిరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సనత్‌నగర్‌లో పలు రోడ్లపై పడేసిన కేబుళ్లు..

తొలగించారు.. అడ్డంగా వేశారు..

విద్యుత్ అధికారులపై మండిపడుతున్న జనం..

కేబుళ్లు..కొత్త చిక్కులు.. | పట్టుతప్పితే అంతే సంగతులు.. | వాహనదారులూ బహుపరాక్..

సనత్‌నగర్: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడుతుందేమో అన్నట్లుగా ఉంది టీజీఎస్‌పీడీసీఎల్ అధికారుల వ్యవహార శైలి. కరెంటు స్తంభాలకు అనధికారికంగా అనుమతుల్లేకుండా ఏర్పాటుచేసిన కేబుల్ వైర్లను హైకోర్టు సూచన మేరకు విద్యుత్ సిబ్బంది తొలగింపు ప్రక్రియను వేగవంతం చేశారు. అయితే ఎక్కడ తొలగించిన వైర్లను అక్కడే రోడ్లపై పడేస్తుండడంతో కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. దీంతో వాహనదారులు ఏమాత్రం అదమరిచినా పట్టుతప్పి కిందపడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల చోటుచేసుకున్న రామంతాపూర్ ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన కేబుళ్ల వైర్ల తొలగింపునకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. గ్రీన్‌ల్యాండ్స్ డివిజనల్ పరిధిలోని సబ్‌స్టేషన్ల పరిధిలో పలుచోట్ల కేబుల్ వైర్లను మొదటి రెండు రోజులు అంతంతమాత్రంగా తొలగించి విరామం ఇచ్చారు. అయితే తాజాగా హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో మళ్లీ కేబుల్ వైర్ల తొలగింపు ప్రక్రియను షురూ చేశారు. ఈ క్రమంలో శని, ఆదివారాల్లో సనత్‌నగర్ ప్రాంతంలో స్తంభాలకు ఇబ్బడిముబ్బడిగా చుట్టలు చుట్టలుగా ఉన్న కేబుల్స్‌ను కట్ చేసి అక్కడే పడేశారు. వాస్తవంగా ఒక వాహనం సమకూర్చుకుని ఎప్పటికప్పుడు తొలగించిన కేబుళ్లను అందులో వేసుకుని తరలించాల్సి ఉంటుంది. కానీ కేబుళ్లు కట్ చేయడంతోనే తమ పని అయిపోయిందని చేతులు దులుపుకుని వెళ్లిపోయారు. ఇప్పుడు వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. వైర్లపై నుంచి రాకపోకలు సాగిస్తూ జారిపడుతున్నారు. ముఖ్యంగా సనత్‌నగర్ ఎస్సార్టీకాలనీలో రోడ్లపై చిందరవందరగా కట్ చేసిన వైర్లను పడేసి వెళ్లిపోయారు. ఎటుచూసినా రోడ్లపై కేబుళ్లు దర్శనమిస్తుండడం చూస్తే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఒకవైపు విద్యుత్ ప్రమాదాలు తొలగించడానికి కేబుళ్లు తొలగిస్తున్న సిబ్బంది అదే కేబుళ్లు రోడ్డుకు అడ్డంగా పడేసి వెళ్లిపోయి మరిన్ని కొత్త చిక్కులను తెచ్చిపెడుతుండడం పట్ల స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతుంది. ఇదేమీ తీరు అంటూ మండిపడుతున్నారు.

ఆగిన 'నెట్‌వర్క్'

అధికారులు చేపట్టిన కేబుళ్ల తొలగింపుతో వివిధ రకాల కేబుల్ ఆధారిత బ్రాడ్‌బాండ్స్ సేవలు నిలిచిపోయాయి. అలాగే కేబుల్ ప్రసారాలు బంద్ అయ్యాయి. దీంతో ఆయా నెట్‌వర్క్ వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా విద్యుత్ సిబ్బంది కరెంటు స్తంభాలకు ఏర్పాటుచేసిన కేబుల్స్‌ను తొలగించుకుంటూ వెళ్లడంతో సనత్‌నగర్ ప్రాంతంలో బ్రాడ్‌బ్యాండ్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. బ్రాడ్‌బ్యాండ్‌పై ఆధారపడ్డ ఆన్‌లైన్ వినియోగదారుల సేవలకు బ్రేక్ పడింది. అలాగే టీవీ ప్రసారాలకు కూడా అంతరాయం ఏర్పడింది. అనుమతులు ఉంటేనే మళ్లీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. అయితే ఆయా నెట్‌వర్క్ సంస్థలు అనుమతులు తీసుకుని టీజీఎస్‌పీడీసీఎల్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు మళ్లీ కేబుల్స్‌ను ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుంది. ఇదంతా పూర్తిచేసుకుని మళ్లీ పునరుద్ధరించుకునే వరకు వినియోగదారుల ఆన్‌లైన్ సేవలకు అంతరాయం తప్పేలా లేదు.



చిన్ననాటి గురువును సత్కరించిన ఎమ్మెల్యే



టీచర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తన చిన్ననాటి టీచర్‌ను గుర్తుపట్టి పలుకరించారు. స్థానిక ఎమ్మెల్యే మీరు నా టీచర్ అనడంతో కొద్ది నిమిషాలు ఆమె నోట మాటరాలేదు. మీరు నిర్మల కుమారి టీచరే కదా 1994–95లో తుకారంగేట్‌లో ప్రోగ్రెస్ స్కూల్‌లో సైన్సు బోధించే వారు కదా అనగానే ఆమె అవునని సమాధానం చెప్పింది. సోమవారం రెజిమెంటల్‌బజార్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే శ్రీగణేష్ అక్కడికి వచ్చారు. పక్కనే ఉన్న నంబర్ 1 ప్రభుత్వ పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లిన ఆయన అక్కడే ఉపాధ్యాయినీగా పనిచేస్తున్న నిర్మల కుమారి టీచర్‌ను గుర్తుపట్టి పలుకరించారు. తన చిన్ననాటి టీచర్‌ను చూడగానే ఎమ్మెల్యే కూడా ఒకింత ఆశ్చర్యానికి గురై తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకున్నారు. అనంతరం టీచర్‌ను సత్కరించారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సోమవారం హాస్టల్స్ ప్రారంభానికి వచ్చిన మంత్రిని ఓయూ జేఏసీ ఛైర్మన్ కొత్తపల్లి తిరుపతి, బహుజన విద్యార్థి జేఏసీ నేత వేల్పుల సంజయ్‌లు ఆర్ట్స్ కాలేజీకి ఆహ్వానించి సత్కరించారు. ఓయూ హాస్టల్స్ నిర్మాణానికి రూ.10 కోట్లు అందచేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రిని సన్మానిస్తున్న విద్యార్థులు

బీఆర్ఎస్ హయాంలోనే ఓయూ భవనాలు

సనత్‌నగర్: ఉస్మానియా యూనివర్సిటీకి నిన్నమొన్నటి వరకు వీసీని కూడా నియమించని ప్రభుత్వం ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో యూనివర్సిటీని అభివృద్ధి చేస్తాననడం హాస్యాస్పదమని ఎమ్మెల్సీ వాణీదేవి విమర్శించారు. గత ప్రభుత్వం యూనివర్సిటీలో భవన నిర్మాణాలకు రూ.80 కోట్ల వరకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసిందని, ఇంతవరకు యూనివర్సిటీకి రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిందేమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే ఉస్మానియా వర్సిటీని బతకనివ్వదంటూ సోమవారం ఓయూ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.80 కోట్ల మేర నిధులను విడుదల చేసి భవనాల నిర్మాణాలను చేపట్టిందని, తాను కూడా తన నిధుల నుంచి రూ.40 లక్షల వరకు నిధులు అందజేసినట్లు ఆమె చెప్పారు.

చెట్ల కొమ్మల తొలగింపు

బొల్లారం: లక్డావాల మెయిన్ రోడ్, చింతల్ బజార్ ప్రాంతాల్లో ప్రజలకు ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను హైడ్రా, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో తొలగించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా ఈ చర్యలు చేపట్టారు.



మట్టి గణపతిని పూజిద్దాం: కార్పొరేటర్ శైలజ



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. సోమవారం వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆమె డివిజన్ ప్రజలకు విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుళ్లను ప్రతిష్టిస్తే బాగుటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసి వార్ఢ్ ఇంచార్జ్ మల్లికార్జున్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

శ్వేతాంబర్ జైనుల సంక్షేమానికి కృషి

కంటోన్మెంట్: శ్వేతాంబర్ జైనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. 'శ్రీ జైన్ శ్వేతాంబర్ తేరాపంత్ సభ' సికింద్రాబాద్ ఆధ్వర్యంలో బోయిన్ పల్లి రాజరాజేశ్వరీ గార్డెన్స్ లో నిర్వహిస్తున్న 8 రోజుల ఉపవాస దీక్షలకు హాజరై జైన్ సాధ్వీలు డాక్టర్ గవనేషశ్రీ, మేరు ప్రభ, మయాంక్ ప్రభ, దక్ష్ ప్రభ ల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తేరా పంత్ సభ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తేరాపంత్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, తేరాపంత్ కమ్యూనిటీకి రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ లో ప్రాతినిధ్యం కల్పించాలని వినతి పత్రం అందజేశారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు సంకి రవీందర్, తేరా పంత్ కమిటీ సభ్యులు సుశీల్ సంచేటీ, హేమంత్ సంచేటీ, ముఖేష్ చొరాడియా, ప్రకాష్ భాటియా, బాబూలాల్ బేద్ తదితరులు పాల్గొన్నారు.

మోండా డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రాంగోపాల్‌పేట్: మోండా డివిజన్‌ను జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్లను ఆదర్శవంతంగా సమగ్రాభివృద్ధి చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికలతో కలిసి ఆయన రెజిమెంటల్‌బజార్‌లో రూ 1.07కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లానన్నారు. దీంతో ఆయన వెంటనే రూ.2.70కోట్లు నిధులు మంజూరు చేయించారని చెప్పారు. మోండా డివిజన్ చరిత్రలో ఎప్పుడూ ఒకే సారి ఇన్ని నిధులు కేటాయించిన సందర్భం లేదన్నారు. త్వరలో మరిన్ని నిధులు కూడా మంజూరు కానున్నాయని దీంతో డివిజన్‌లో ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

సమస్యలపై గల్లీగల్లీలో పాదయాత్ర

మోండా డివిజన్‌లో ఉండే ప్రతి సమస్యను తెలుసుకునేందుకు గణపతి నవరాత్రుల తర్వాత గల్లీగల్లీలో పాదయాత్ర చేయనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. వారం రోజుల పాటు డివిజన్‌లోని ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని.. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ ప్రజల్లో సైతం పర్యావరణ అనుకూల విధానాలకు స్పందన లభిస్తోందని అన్నారు. వినాయక చవితి ఉత్సవాలకు అధికార యంత్రాంగం సహకరించాలని, అన్నీ ఏర్పాట్లు జరపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామాల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి



జెడ్‌సీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు సౌందర్య

అడ్డగుట్ట: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని జీహెచ్‌ఎంసీ జెడ్‌సీ రవికిరణ్‌ను కోరారు. బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు గాసుల సౌందర్య సోమవారం సికింద్రాబాద్‌లోని జోనల్ కార్యలయంలో జెడ్‌సీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వారం కురిసిన భారీ వర్షాలకు అడ్డగుట్టలోని ఏ,బి,సి, డి సెక్షన్‌లు, తుకారంగేట్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ కూడా గుంతలమయంగా మారినట్లు తెలిపారు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా వినాయక చవితి పండుగను దృష్టిలో పెట్టుకొని మండప నిర్వాహకులు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్లకు తగిన మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హంసరాజ్ స్థానికుడు రెడ్డప్ప పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్..ప్రజల పరేషాన్



ఎస్‌ఆర్‌నగర్‌లోని హోటళ్ల ముందు పార్క్ చేసి ఉన్న వాహనాలు

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్‌లోని ప్రధాన రోడ్లపై అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హోటళ్లు, కర్రీ పాయింట్ల వద్ద నిత్యం వాహనాలు పార్కింగ్ చేసి ఉంచుతున్న కారణంగా రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాలు నుండి బీకేగూడ వైపు వెళ్లే మార్గంలో ఉన్న మూడు హోటల్స్ ముందు రోడ్డుపై పెద్ద సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. బల్కంపేట పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న హోటల్ ముందు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అర్ధరాత్రి వరకు హోటల్ తెరిచి ఉంటుండటంతో రోజూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే మూలమలుపు వద్ద ఉన్న హోటల్ ముందు వాహనాలు నిలుపుతున్న కారణంగా ఎస్‌ఆర్‌నగర్ చౌరస్తా వైపు వాహనాలను మళ్లించాలంటే చాలా ఇబ్బందికరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



కమ్యూనిటీహాలు చౌరస్తాలో..

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ సీజ్



సనత్‌నగర్: పరిశుభ్రతకు తిలోదకాలిచ్చి ఆహార పదార్థాలను నిల్వ చేసి వినియోగదారుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్న బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని గంగాభవానీ ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్స్, మీల్స్ సెంటర్‌ను జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం మూసివేశారు. స్థానిక కాంగ్రెస్ నేతలు విశాల్ సూదం, చిరంజీవి, బాలకృష్ణ తదితరులు హోటల్ వంటగదిని పరిశీలించి అక్కడి అపరిశుభ్రత వాతావరణం చూసి అవాక్కయ్యారు. దీంతో వారు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి స్వాతి నేతృత్వంలో అధికారులు, సిబ్బంది హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. వంట గది పూర్తి అపరిశుభ్రంగా ఉండడంతో పాటు బొద్దింకలు, ఎలుకలు కనిపించాయి. వ్యర్థాల మధ్యే వంటలు చేస్తున్నట్లు గుర్తించారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో హోటల్‌ను మూసివేసి, నిర్వాహకులను నోటీసులు జారీ చేశారు.

గణపతి దేవాలయం ముస్తాబు

రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

రాంగోపాల్‌పేట్: చారిత్రాత్మక గణపతి దేవాలయం వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. దీని కోసం దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఎంతో చరిత్రతో పాటు ప్రాముఖ్యత కలిగిన ఈ దేవాలయంలోని స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. దేవాలయం మొత్తం పువ్వులు, విద్యుత్ దీపాల అలంకరణతో తీర్చిద్దిదారు. దేవాలయంతో సుందరీకరించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు ఉదయం 8గంటలకు ఒక్కో రోజు ఒక అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వడంతో పాటు సాయంత్రం 6గంటలకు వాహన సేవలు ఉంటాయి.



గణపతి స్వామివారు



సికింద్రాబాద్ గణపతి దేవాలయం

ఇకపై ఆన్‌లైన్‌లోనే 'మార్ట్‌గేజ్'

- రిజిస్ట్రేషన్ నిబంధనలో స్వల్ప మార్పు
- కనిష్ట పరిమితితో మినహాయింపు లేనట్లే..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన 'మార్ట్‌గేజ్' విధానాన్ని ఆన్‌లైన్‌లోనూ అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు సోమవారం కంటోన్మెంట్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సీఈఓ మధుకర్ నాయక్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులకు సైతం ఆఫ్‌లైన్‌లోనే మార్ట్‌గేజ్ చేస్తున్నారు. ఇకపై పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారానే మార్ట్‌గేజ్ విధానాన్ని అమలు చేయాలని సీఈఓ మధుకర్ నాయక్ ఆదేశించారు. సమావేశంలో మార్ట్‌గేజ్ విధానంలో సవరణలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 240 గజాలకు పైబడిన విస్తీర్ణం కలిగిన భవనాలకు మాత్రమే మార్ట్‌గేజ్ విధానంలో అనుమతులు ఇస్తున్నారు. నిర్దేశిత ప్లాన్ ప్రకారం నిర్మాణం పూర్తి చేస్తేనే మార్ట్‌గేజ్ రిలీజ్ చేసి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తున్నారు. కంటోన్మెంట్‌లో 133 గజాలకు పైబడి చేపట్టే ప్రతి నిర్మాణానికి సంబంధించి 10 శాతం కంటోన్మెంట్‌కు మార్ట్‌గేజ్ చేస్తేనే అనుమతులు జారీ చేస్తారు. ఈ నిబంధనను సవరించాలన్న స్ట్రక్చరల్ ఇంజనీర్ల సూచనను బోర్డు అధికారులు తిరస్కరించారు. అయితే మార్ట్‌గేజ్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయడం వల్ల, ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ)లో మార్ట్‌గేజ్ ఉన్నట్లుగా చూపిస్తోందని స్ట్రక్చరల్ ఇంజనీర్లు తెలిపారు. దీంతో సదరు భవన యజమానికి బ్యాంకులోన్ రిలీజ్‌లు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీలో మాదిరిగా పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన కాకుండా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ప్రత్యేక బుక్‌లో నమోదు చేసి, నిర్మాణం పూర్తయ్యాక రిలీజ్ చేసే విధానం అమలు చేయాలని కోరారు. ఈ మేరకు సవరణలు చేయాల్సిందిగా సీఈఓ మధుకర్ నాయక్ బోర్డు ఇంజనీరింగ్ ఉన్నతాధికారులకు సూచించారు. అక్రమ నిర్మాణాలకు ఆదిలోనే చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే మార్ట్‌గేజ్ విధానం ప్రవేశపెట్టామని సీఈఓ మధుకర్ నాయక్ స్పష్టం చేశారు. సమావేశంలో బోర్డు ఇంజనీరింగ్ అధికారులు ఉమాశంకర్, ఫణికుమార్, దినేశ్, ఆశిష్, తరుణ్, కేకే రెడ్డి, శివాజీ, సురేశ్, స్ట్రక్చరల్ ఇంజనీర్లు పీఎల్‌నాగేశ్, సమీనా, మృత్యుంజయ మూర్తి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

